# ఆర్కిటెక్ట్ సుబ్బారావు

**-రామ్ దివాకర్**

వెధవ బ్రతుకు. వెధవన్నర వెధవ బ్రతుకు. పూర్వజన్మలో పాపం చేసినవాడు యీ జన్మలో పశువుగా పుడతారంటారు. పచ్చి అబద్ధం! పాపం చేసిన పశువు మనిషిలా పుడుతుంది. పుట్టి నానా బాధలు అనుభవిస్తాడు. అంతా యింతా కాదు!

చీకటి పడుతున్నా ఆఫీసులో లైట్ వేసుకోకుండా- దిగాలుగా కూర్చుని వేయి ఆలోచనల్లో నిమగ్నుడయ్యాడు. 'ఏమిటీ జీవితం? ఓ పశువులా పుట్టినా బావుండేది. యీ ఫైనాన్షియల్ ప్రాబ్లమ్స్ వుండవు. భగవంతుడు ప్రత్యక్షమై తనని కుక్కగా మార్చేస్తే ఎంత బావుణ్ణు. భోజనం ప్రాబ్లమ్ సాల్వ్. పెంటకుప్పలోకి దూకి ఎంచక్కా ఏరుకు తినవచ్చు'.

సెల్ మోగేసరికి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు సుబ్బారావు.

"సార్! మేం ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాను. మీకు మూడు లక్షలదాకా పర్సనల్ లోన్ వస్తుంది- కావాలా?"

చిర్రెత్తుకొచ్చింది సుబ్బారావుకి.

"కావాలి తల్లీ- ఇమ్మీడియట్‌గా. యీ ఆరునెలల్లో మా బాంక్ ఎకౌంట్‌లో పది చెక్కులు బౌన్స్ అయ్యాయి. ఐటీ రెండు సంవత్సరాలుగా కట్టలేదు డబ్బులేక. మీరు ఈ లోన్ ఇస్తే కడతాను. మూడు లక్షలకి చెక్ తీసుకుని రండి. ఫార్మాలిటీలు యిక్కడే పూర్తి చేస్తాను"

ఠక్కున ఫోన్ పెట్టేసింది. బహుశా ఆ అమ్మాయి జీవితంలో ఇటువంటి కేసు ఎప్పుడూ తగిలి ఉండదు.

కోపం ముంచుకొచ్చింది సుబ్బారావుకి. ప్రతివాడూ లోన్ కావాలా...కావాలా? అని అడుగుతాడు వెంటబడి. ఇవ్వడు... వంద కండిషన్లు, చెక్కులు బౌన్స్ కాకూడదు. ఐటీ ఇంత ఉండాలి లేదా ట్రాక్ రికార్డు బాగుండాలి.

ఇవన్నీ బాగుంటే లోన్ ఎందుకు? బాధల నుండి బయటపడతానికే కదా లోన్.

ఏదో బాధ- నిస్పృహ- డిప్రెషన్. ఎవర్నో తన్నేయాలని ఉంది.

"అరె- నువ్వు సుబ్బారావువి కదూ" అంటూ గుమ్మం దగ్గర నిలబడిన ఆసామి ఠక్కున అడిగాడు. చూడటానికి రాజకీయవేత్తలాగా ఉన్నాడు. గుర్తుకు రాలేదు.

"ఆ...అవును...మీరు..." సుబ్బారావు తడబడ్డాడు.

"నేనయ్యా. నీ క్లాస్‌మేట్ రాజు మేనమామని- హాస్టల్‌కి వస్తుండే వాడిని. ఆఫీసుకి కూడా వచ్చాను రెండుసార్లు.."

గుర్తుకు వచ్చింది.

"మీరా రావుగారూ- చాలా సంవత్సరాలయింది. ఎలా ఉన్నారు? కూర్చోండి" ఆహ్వానించాడు.

"కూర్చుంటా కానీ...ఏమిటి కరెంట్ సేవింగా? లైట్ వేయలేదు?"

"అబ్బెబ్బె. ఆలోచిస్తూ కూర్చుండిపోయాను" లైట్ వేసాడు.

"మీ ఆర్కిటెక్ట్స్ అంతా ఇంతే. ఏదో లోకంలో ఉంటారు" రావు ఆఫీసుని ఎక్స్‌రే కళ్లతో చూసాడు. సుబ్బారావు మొఖంవైపు చూసాడు. సిగ్గుతో కళ్లు దించుకున్నాడు సుబ్బారావు.

కుర్చీలో వెనక్కు జారబడి అన్నాడు రావు- "ప్చ్...నీ పరిస్థితేం బాగోలేదు"

"మీకెలా తెల్సుసార్!" అనుకోకుండానే అనేసాడు సుబ్బారావు.

"నీ ముఖవర్చస్సు- ఆఫీసు రూపురేఖలు చూస్తుంటే తెలియటంలే-" సుబ్బారావు తలదించుకుని కూర్చున్నాడు.

"మూడేళ్ళ క్రితం నీ ఆఫీసుకు వచ్చినప్పుడు ఎలా ఉండేది? కళకళలాడుతూ- బిజీగా- ఏమిటీ నీ ప్రాబ్లం?" రావు అడిగాడు.

"ప్రాజెక్ట్స్ లేవు సార్..." కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఒకటో రెండో చిన్నవి నడుస్తున్నాయి. క్లయింట్ డబ్బివ్వడు. గట్టిగా అడిగితే- డబ్బు ఎగ్గొట్టి- యింకో డెకరేటర్‌ని పట్టుకుంటాడు. కుక్క గొడుగుల్లా మొలుచుకు వచ్చేస్తున్నారు"

తేలిగ్గా కొట్టి పడేసాడు రావు "అది నీ అసమర్థత. అయిదేళ్ళు ఆర్కిటెక్చర్ చదివి- రెండేళ్లు పీజీ చేసిన నీకు ఈ ఆర్నెల్లు - సంవత్సరం డిప్లమో వాళ్ళు కాంటీషన్ ఎలా అవుతారు?...తప్పు ఒప్పుకో"

సుబ్బారావుకి ఏడుపు ముంచుకు వచ్చింది. చిన్నప్పుడు లెక్కల మాస్టారు జ్ఞాపకం వచ్చారు. భోరున ఏడ్చేసాడు.

ఎన్నాళ్ళో గుండెల్లో దాగిన బాధ పెల్లుబికి వచ్చేసింది.

రావు సుబ్బారావుని ఏడ్వనిచ్చాడు- ఓదార్చకుండా. కొంతసేపటికి తేరుకుని "సారీ సార్" అన్నాడు.

"సారీ ఎందుకు? మనసు తేలికవుతుంది. జీవితంలో ఎగుడు దిగుడు అందరికీ వుంటుంది. ఆఫీసు రెంటా? సొంతమా?" రావు అడిగాడు.

"రెంటే. నెలకు అయిదు వేలు"

"బహుశా మూడు నాల్గు నెలల రెంట్ బాకీ వుండి వుంటుంది. అవునా?"

తలవంచుకున్నాడు సుబ్బారావు.

"కారు వుందా?"

"ఉంది! మారుతి 800"



కళ్లు మూసుకుని కొన్ని నిమిషాలు ఆలోచిస్తూ ఉండిపోయాడు రావు. రావునే కళ్ళప్పగించి చూస్తున్నాడు సుబ్బారావు.

"చాలా విచారకరం సుబ్బారావూ. యీ సంగతి నాకు ముందే తెల్సివుంటే నీ పరిస్థితి వేరుగా ఉండేది. ప్చ్"

గుండె దడదడలాడింది సుబ్బారావుకు. 'వాస్తు' అని మొదలుపెట్టాడు కదా- ఈ మధ్య ప్రతీవాడూ ఆఫీసుకు వచ్చి ఓ గంట తల తిని వెళ్తున్నాడు.

రావు అందుకున్నాడు. "చూడు నాయనా! రోజులు మారిపోయాయి. కాలచక్రం గిర్రున తిరుగుతుంది. మనుషులు- దేస్తులూ- అన్నీ మారిపోయాయి. మనం మారాలి. ఇదవరకు 'జనం టాలెంటు చూసేవాళ్ళు. సిన్సియారిటీకి..హానెస్టీకి విలువ ఇచ్చేవాళ్లు. యీ రోజుల్లో వాటికి విలువ లేదు. నీవు వాటిని పట్టుకు కూర్చుంటే అడుక్కు తింటావు. నిజానికి ఇప్పటి నీ పరిస్థితి దాదాపు అంతే"

కుతకుతలాడిపోయాడు సుబ్బారావు. రోజులు బాగాలేకపోతే- అడ్డమైన ప్రతీ వెధవా- ఆఖరికి రోడ్డున పోయే అడుక్కుతినేవాడు కూడా నిలబెట్టి సలహాలిస్తాడు. ఛ! వెధవ బ్రతుకయిపోయింది. 'హే- భగవాన్- ఏమిటీ నాకీ శిక్ష?'

రావు మరల అందుకున్నాడు.

"ఈ రోజుల్లో పైకి రావాలంటే- టాలెంట్- నాలెడ్జీ గట్రా ఏమీ అక్కర్లేదు. మార్కెటింగ్ ఉంటే చాలు. మనకు మనం క్రియేట్ చేసుకోవాలి. అసలు డిజైన్‌లో బేసిక్స్ తెలియనివాళ్ళు లక్షలు- కోట్లు సంపాదిస్తున్నారు. తెలుసా? రోరింగ్ బిజినెస్-"

"అది కరెక్ట్ సార్.. నేను గమనించాను" బుద్ధిమంతుడిలా ఒప్పుకున్నాడు.

"అయినా లాభం ఏమిటి? ఏమయినా ప్రయత్నించావా? మారావా? నెట్‌లోంచి డౌన్‌లోడ్ చేసి ప్రాజెక్ట్స్ చేసేస్తున్నారు. నీవింకా కూర్చుని డిజైన్ చేస్తున్నావు"సుబ్బారావు మాట్లాడలేదు.

"నీ ఆఫీసు చూడు ఎలావుంది?" రావు అడిగాడు.

"బాగానే వుంది కదా సార్- సింపుల్‌గా, నీట్‌గా" అన్నాడు.

"అక్కడే దెబ్బ తిన్నావు. నిజానికి నీవు కరెక్ట్. కానీ జనానికి కావల్సింది యిది కాదు. జనానికి ఎప్పుడూ కొత్తదానం కావాలి. చెత్తయినా ఫర్వాలేదు. కొత్తదనం..అది అర్థం చేసుకొని పని చేస్తే రాణిస్తావు"

"అదెలా సార్! ప్రతి ఆర్కిటెక్ట్‌కూ ఒక స్టయిల్ వుంటుంది. ప్రాజెక్ట్ టైపు-బడ్జెట్, ఎండ్ యూసర్‌ని దృష్టిలో ఉంచుకొని డిజైన్ చేయాలి" సుబ్బారావు అన్నాడు. ఠక్కున అందుకున్నాడు రావు.

"ఆ పనికిమాలిన రూల్స్- థియరీలు చదువురకే- ఫాలో అవుతే అడుక్కు తింటావు. నీ టేబుల్ వెనుక వాల్‌కు ఆరంజ్ కలర్ కొట్టు. యీ గోడకు లెమన్ ఎల్లో, సీలింగ్ తెలుపు. దానిమీద కోబాల్ట్ బ్లూ చారలు"

కళ్ళు గిర్రున తిరగాయి సుబ్బారావుకు. ఊహించుకోవటానికే భయంగా ఉంది. అసలు ఆర్కిటెక్ట్ ఎవరన్న ధర్మ సందేహం వచ్చింది.

"సార్! ఇది చిన్న రూమ్. ఇన్ని కలర్స్..అవీ బ్రైట్ అస్సలు వాడకూడదు. యాక్సువల్లీ..."

"గాడిదగుడ్డు కాదూ? ఇంతకు ముందు చెప్పింది అదే. ఆ థియరీలు- కాలిక్యూలేషన్స్ పక్కన పెట్టు. కాంపోజిషన్-బాలెన్స్-హార్మనీ గట్రా పదాలు మరచిపో. బయట ప్రపంచంతోపాటు నీవూ మారాలి. ఒకప్పుడు బిల్డింగ్ ఎలివేషన్స్ చక్కగా, సింపుల్‌గా ఉండేవి. ఆ తర్వాత ప్రతి బిల్డింగ్ ఎలివేషన్‌లో పిల్లర్స్, రోమన్, గోతిక్ వచ్చేసాయి. అవి పెట్టకపోతే నీవు ఆర్కిటెక్ట్‌వి కాదు. ఇప్పుడు ఎసిపి పానల్ ఎలివేషన్ గ్లాస్ నీవు పెట్టి తీరాలి. పెట్టకపోతే నీకు నాలెడ్జ్ లేదనుకుంటారు. యింకా దమ్ముంటే ఎవరూ చేయని పని చేయి. బిల్డింగ్ ఎలివేషన్‌కి పచ్చగడ్డి అంటించి గ్రీన్ ఆర్కిటెక్చర్ అని ఓ కొత్త థియరీ మొదలుపెట్టు"

బుర్ర పనిచేయడం మానేసింది సుబ్బారావుకి, సగం కోమాలోకి వెళ్ళిపోయాడు. తేరుకుని అడిగాడు- నీరసంగా "సార్! మా ప్రొఫెషన్ గురించి ఇంత క్షుణ్ణంగా మీకెలా తెలుసు?"

"మీ ప్రొఫెషన్ అటువంటిది. ప్రతీవాడు వేలుపెట్టి కెలుకుతాడు. మీ డ్రాయింగ్స్‌ని వాస్తు పండితులు మారుస్తారు. కోస్టల్ జిల్లాలో మేస్త్రీలు సెన్సార్ చేస్తారు. ఆ తర్వాత బిల్డింగ్ మెటీరియల్ డీలర్స్ స్పెసిఫికేషన్స్ మార్చేస్తారు. ఆర్కిటెక్ట్ డిజైన్స్‌ను నాన్ ఆర్కిటెక్ట్స్ స్క్రూటినైజ్ చేస్తారు. కాదంటావా? అంతెందుకు? ఆ మధ్య ఓ నాన్ ఆర్కిటెక్ట్‌ని, ఆర్కిటెక్ట్‌గా రికగ్నైజ్ చేస్తూ.. ఓ జి.వో. పాసయింది తెలుసా?"

తెలుసన్నట్లు తలూపాడు సుబ్బారావు.

"మీరేం చేసారు? ఏం చేయలేదు. మేమూ ఒక సంవత్సరం డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తాం. జి.వో. పాస్ చేయమని అడిగుంటే కథ అడ్డం తిరిగుండేది. వదిలెయ్...అది మీ ప్రాబ్లెమ్" ఊపిరి పీల్చుకున్నాడు రావు.

"మా బిల్డింగ్‌లో ఓ కుర్ర ఇంటీరియర్ డెకరేటర్ ఉన్నాడు. ఆరునెలల డిప్లొమా చేసాడు. సంవత్సరంలో యాభై లక్షలు వెనుకేసాడు"

సుబ్బారావుకి ఏడుపు వచ్చింది. ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. ఈ మధ్య ఆఫీసుకు వచ్చే ప్రతీ వెధవా.. వాడిన్ని ప్రాజెక్ట్స్ చేస్తున్నాడు. ఇంతమంది స్టాఫ్ ఉన్నారు. ఇన్ని కోట్లు సంపాదించాడు. ఒక్క ప్రాజెక్ట్ చేసి బి.ఎమ్.డబ్ల్యు కారు కొన్నాడు అని వాడి గురించీ, వీడి గురించీ తెగ చెప్పి మరీ ఏడిపించేస్తున్నారు. వింటుంటే కుతకుతలాడిపోతుంది.


"యీ ఉడెన్ ఫర్నీచర్, ఆ పోచంపల్లి అపోస్ట్రీ ఇవన్నీ నడవ్వు. 'ఫంకీ' ఫర్నీచర్- మల్టీకలర్ ఫాబ్రిక్ అర్థంకాని వాల్ హేంగింగ్- ఆ మూల కుండీలో ఎండుగడ్డి, సీలింగ్‌కు ఓ నిచ్చెన వేలాడతీయి ఎరుపు రంగేసి"

జీవితం మీద విరక్తి కలిగింది సుబ్బారావుకు. ఆర్కిటెక్చర్ ఎందుకు చదివానా దేవుడా అనుకున్నాడు. ఏ బి.ఏ.నో చదివుంటే- ఏదో ఆఫీసులో ఫైల్స్ మధ్య తలదూర్చి, ఏదో పని చేసుకుంటూ ఉండేవాడు. ఎవడూ ఇలా నిలదీసి ప్రశ్నించడు. అందరికీ లోకువయిపోయింది ఈ ప్రొఫెషన్.

రావు అందుకున్నాడు "వింటున్నావా? యీ విధంగా పిచ్చిగా డిజైన్ చెయి. అదే యిప్పటి స్టయిల్. క్లయింట్స్ లైన్లో నుంచుని ఉంటారు. అసలు నీవు డిజైన్ చేయవలసిన పనిలేదు. నెట్‌లోంచి కాపీకొట్టి క్లయింట్‌కి చూపించు. ఒకదానికీ-యింకోదానికి అస్సలు సంబంధం లేకుండా ఉండే- గ్రేట్ డిజైనర్ క్రింద లెఖ్ఖ!"

అంత బాధలోనూ ఏదో చిన్న ఆశాకిరణం కనబడింది సుబ్బారావుకి.


"కావచ్చు! కానీ అది నావల్ల కాదేమో సార్! జనాన్ని మోసం చేసినట్లవు



## శక్తిని కోల్పోతున్న సముద్రాలు

ఒకప్పుడు వాతావరణంలోని బొగ్గు పులుసు వాయువుని సముద్రాలు తమలో ధారాళంగా కలుపుకోగల శక్తిని కలిగి ఉండేవి. అయితే 1950 నుంచి ఇప్పటిదాకా ప్రపంచంలో విడుదల అయిన కార్బన్ డయాక్సైడ్‌ని ఎంత అధికంగా జీర్ణించుకున్నాయంటే సముద్ర జలాలకిక మీదట ఆ శక్తి పూర్తిగా పోతుందని ఇటీవల కొలంబియా యూనివర్సిటీ శాస్త్రజ్ఞుల పరిశోధనలో తేలింది.

-తటవర్తి



తుంది. మంచి డిజైన్- ఎకనామికల్‌గా చేయడం నా వృత్తి. ఒక ఓల్డేజ్ హోమ్‌లో ఇలా బ్రయిట్ కలర్స్ వేస్తే ఎలా చెప్పండి'' సమర్థించుకోబోయాడు సుబ్బారావు.

"అలా వేయకపోతే- నీకెవరూ ప్రాజెక్ట్స్ ఇవ్వరు. మాటలతో క్లయింట్స్‌ని పడగొట్టాలి. ఛట్! ఓల్డేజ్ హోమ్ అయితే మాత్రం డల్‌గా ఉండాలా? సీనియర్ సిటిజన్స్‌కి లైఫ్ క్రియేట్ చేయాలి. వాళ్ళ జీవితాలు కలర్‌ఫుల్‌గా మార్చాలి. బ్రైట్ కలర్స్‌తో వాళ్ళ లైఫ్‌ని ఇంటరెస్టింగ్‌గా క్రియేట్ చేయాలి. జనం ఈ ట్రెండ్‌కి అలవాటు పడిపోయారు. నీవు చెప్పగానే ఆనందంగా ఒప్పుకో. ఎడ్వాన్స్ ఇచ్చేస్తారు''

ఎడ్వాన్స్ మాట వినగానే ముఖంలో ఆనందం కనపడింది సుబ్బారావుకి. "సరే కుర్రాడితో కాఫీ తెప్పించు'' రావు అన్నాడు.

"కుర్రాడా?'' బిక్కమొగం వేసాడు సుబ్బారావు.

"ఏం బయటకు వెళ్లాడా?''

"అసలుంటే కదా?''

బిత్తరపోయాడు రావు.

"వాట్! అటెండర్ లేకుండానే ఆఫీసు నడిపిస్తున్నావా? అసలు స్టాఫెంత మంది?''

"ఒక్కతే అసిస్టెంట్. డిప్లమో చదివింది. వూరెల్లింది''

రావుకు అనుమానం వచ్చింది. "వూరెల్ళిందా? మానేసిందా?''

"లేదు..వూరెల్ళింది''

"వస్తుందంటావా?''

"వస్తుంది సార్. ఎందుకు రాదు?''

"పక్కా వస్తుందా?''

"తప్పక వస్తుంది సార్!''

"అంత గారెంటీ ఏమిటి?''

"ఆ అమ్మాయికి నాల్గు నెలల సాలరీ యివ్వాలి సార్''

తలబాదుకున్నాడు రావు. ఏం అనాలో అర్థం కాలేదు.

"ఏం సార్..తలనొప్పా? టాబ్లెట్ వుంది..'' సుబ్బారావు అన్నాడు అమాయకంగా. వద్దన్నట్లు చెయ్యి చూపించాడు.

"కాఫీ కావాలా సార్?''

"చూస్తూ చూస్తూ ఆర్కిటెక్ట్‌చేత హోటల్‌నండి కాఫీ తెప్పించలేను''

"దానిదేముంది సార్- మన పని మనం చేసుకోవాలి'' లెవల్లో చెప్పాడు సుబ్బారావు.

రావు సుబ్బారావుని పరీక్షగా చూసాడు. మనిషి నీరసంగా ఉన్నాడు.

"నిజం చెప్పు. మధ్యాహ్నం భోజనం చేసావా?''

నీరసపడ్డాడు సుబ్బారావు. "క్లయింట్ వచ్చి డబ్బులు ఇస్తానన్నాడు. వస్తాడేమోనని చూస్తూ వెళ్ళలేకపోయాను''

"క్లయింట్ రాలేదు. డబ్బు ఇవ్వలేదు. అవునా?'' రావు.

అవునన్నట్లు తల ఊపాడు.


"నీవిలా మొహమాటంగా ఉంటే అందరూ యిలాగే ప్రవర్తిస్తారు. నీకు డబ్బివ్వలేదన్న గిల్టీ- భయం వాళ్లలో కలిగేలా నీవు ప్రవర్తించాలి. సరే నడూ. ఏమయినా తిని వద్దాం''

"వద్దు సార్! ఆఫీసు యింకా గంటయినా తెరిచి ఉంచాలి. నా ప్రిన్సిపుల్'' రావు వెళ్ళి పక్క హోటల్లో కాఫీ త్రాగి- సుబ్బారావుకి దోసె తీసుకొని వచ్చాడు. దోసె తింటూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు సుబ్బారావు. శుభ్రంగా లా చదివినా ఉన్న నాల్గు కేసులు సంవత్సరాలు లాగి- కోర్టులో ఉల్టా గిల్టా చేసి- క్లయింట్ మీద బ్రతికేయవచ్చు. క్లయింట్ చెప్పినట్లు వింటాడు. కనీసం చిన్నప్పటినుండి క్రికెట్ మీద కాన్‌సన్‌ట్రేట్ చేసినా ఈపాటికి టెస్ట్ ప్లేయర్ అయిపోయి కోట్లు సంపాదించి ఉండవచ్చు. మొదటిసారిగా తల్లిమీద తెగ కోపం వచ్చింది. 'ఈ ఆటలు తిండి పెడతాయా?' అని ఆడనీయకుండా చేసి భవిష్యత్ పాడు చేసింది.

సుబ్బారావు తిన్నాక "నీ మంచితనం నీకు అన్నం పెట్టదు. ఇది కలియుగం. అంతా మాయ, హంగులు. హిందీ సిన్మా 'కథ' చూసావా? అందులో 'ఫరూక్‌షేక్' లైవ్‌లో నీవుండాలి. ఒకప్పుడు అబ్బాయి ఎంత మంచిగా- నిరాడంబరంగా- సత్ప్రవర్తనతో ఉంటే- అమ్మాయిలు అంత ఇష్టపడేవాళ్లు. కానీ ఇప్పుడు- నీవు ఎంత పోకిరీ వెధవ్వయితే అంత లైక్ చేస్తారు. టేస్ట్ మారింది. కాలం- ప్రజలతో పాటు మనం మారాలి''

గుడ్లప్పగించి వింటున్నాడు సుబ్బారావు.

"ముందు నీ ఆఫీసు గెటప్ మార్చేయి. తక్కువలోనే ఇంటీరియర్స్ మార్చేయి. ఈ ఒక్క రూమ్‌తో ఏం నడుస్తుంది. పక్కరూమ్ కూడా అద్దెకు తీసుకో'' రావు.



## ఆశిన్ నిజాయితీ

జంతు సంరక్షణ సంస్థవారు తమ సంస్థకి పబ్లిసిటీ చేయమని ఆశిన్‌ను అడిగితే ఆ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించిందిట. కారణం ఏమిటని అడిగితే అందుకు ఆశిన్ బదులిస్తూ 'నేను ప్రతిరోజూ నాన్‌వెజ్ లేనిదే ఉండలేను. అలాంటిది ఈ సంస్థకి అంబాసిడర్‌గా ఎలా ఉంటాను చెప్పండి. మనం చెప్పేదొకటి నిజ జీవితంలో చేసేదొకటి ఉండకూడదు కదా. అందుకే ఆ ఆఫర్‌ని తిరస్కరించాను' అని నిజాయితీగా చెప్పింది ఆశిన్.



"ఈ రూమ్ రెంట్ కట్టటమే కష్టంగా వుంది" సుబ్బారావు అన్నాడు.

"మొదట్లో వుంటుంది. తరువాత అలవాటు పడిపోతావు. అయినా నేను చెప్పిన మార్పుల వలన నీ చక్రం తిరిగిపోతుంది"

ఏ మార్పులో అని గుండె దడదడలాడింది సుబ్బారావుకు.

"అప్పో సప్పో చేసి నేను చెప్పినట్లు చేయి. చిన్న రిసెప్షన్ క్రియేట్ చేసి ఓ చక్కటి అమ్మాయిని అపాయింట్ చేయి"

"దొరకటం కష్టం సార్. యీ కాల్ సెంటర్స్ వచ్చిన తర్వాత అందరూ అటే ఎగబడుతున్నారు"

"హైద్రాబాద్‌లోనే ఎందుకు వెతకాలి? చిన్న చిన్న వూర్లో చాలా మంచి అమ్మాయిలు- అవకాశం కోసం చూస్తుంటారు. అక్కడ అడ్వర్టైజ్ చేయి. చాలా తక్కువ జీతంతో అపాయింట్ చేసి- ఇంగ్లీషులో ట్రెనింగ్ ఇవ్వు. ఎక్కడికీ పోరు"

"మీరన్నట్లుగానే...పోయిన సంవత్సరం గుడివాడనుంచి ఓ అమ్మాయిని అపాయింట్ చేసాను. ఆటోకేడ్ కూడా నేర్పించాను స్టూడియోలో కూడా హెల్ప్ ఉంటుందని.."

"మరేదా అమ్మాయి"

"పక్కాఫీసు బాయ్‌తో లేచిపోయింది"

"పోనీలే! నేను చెప్పినట్లు చెయి. నీ యాటిట్యూడ్ మార్చుకోవాలి. నీ అవుట్‌లుక్- గెటప్ అన్నీ మార్చేయి. నీవు చేసే ప్రతీపనీ- ప్రతీ స్టెప్ నీ పురోగమనానికి ఉపయోగపడాలి" బుద్ధిమంతుడిలా వింటున్నాడు సుబ్బారావు.

"ముందు ఆఫీసు లుక్ మార్చు. రిసెప్షన్- ఆ పక్క నీ క్యాబిన్, ఆ సైడ్ స్టూడియో, కనీకనబడని గ్లాస్‌డోర్. రిసెప్షన్‌నుంచి స్టూడియో కనపడాలి. కనీసం పది సిస్టమ్స్ వుండాలి స్టూడియోలో"

అదిరిపోయాడు సుబ్బారావు "తిప్పి తిప్పి కొడితే యిద్దరికీ కూడా సరిగా పని ఉండదు సార్!"

"తెల్సు- అన్ని సిస్టమ్స్ 'కేడ్' వుండాలని చెప్పానా? ఓ రెండో మూడో కేడ్- మిగతావి అన్నీ డేటా ఎంట్రీ. అవుట్ సోర్సింగ్‌లో డేటా ఎంట్రీ జాబ్స్ చాలా దొరుకుతాయి. తెచ్చుకో. చూసినవాళ్ళు. పదిమంది స్టాఫ్ ఉన్నారనుకుంటారు. నీ బిజినెస్ పెరిగే కొద్దీ సిస్టమ్స్ పెంచు, ఇరవై- యాభై... యీ విధంగా..."

ఏడుపు వచ్చింది సుబ్బారావుకు. ఆర్కిటెక్చర్ చదివినందుకు మరల తిట్టుకున్నాడు. ప్రతివాడికీ లోకువయిపోయాడు.

"నీ గెటప్ మార్చేయి. మంచి బ్రాండ్ బట్టలు కొను. నీ గాగుల్స్..అవును గాగుల్స్ ఉన్నాయా?"

"మొన్నే కొన్నాను. రెండు వందల ముప్పయిపెట్టి" సుబ్బారావు అమాయకంగా చెప్పాడు.

"నీతో వచ్చిన ప్రాబ్లమ్ అక్కడే. 'రేబాన్' లేదా 'టామీ హిల్లర్' గట్రా బ్రాండ్‌లు కొనాలి. వీలయితే ఎక్కువ ఖరీదైనది కొనాలి- ఎనిమిదివేలకు తక్కువ కాకుండా. అప్పు చేసయినా కొను. లెవల్ పెంచాలి. అలాగే నీ సెల్ ఫోన్- ఏదీ చూపించు" చూపించాడు సుబ్బారావు.

సుబ్బారావును పైనుంచి క్రిందదాకా చూసాడు రావు.

"ఇదే ఫోన్ మా డ్రైవర్ దగ్గర కూడా ఉంది"

కళ్లల్లో నీళ్లు తిరిగాయి సుబ్బారావుకు.

"అలా బాధపడి లాభంలేదు. చేదునిజాలు ఇవి. పైకి రావాలంటే చాలా మారాలి. కష్టపడాలి, త్యాగాలు చేయాలి. రిస్క్ తీసుకోవాలి. చాలా హంగులు అవసరం. స్లీక్ సెల్‌ఫోన్... కాస్ట్లీ మోడల్ కొను. ఎప్పుడూ గుర్తుంచుకో. నీ చేతిలో వున్నది ఖరీదైనది, ప్రత్యేకంగా ఉండాలి. నీవు చేసే ప్రతి పనీ ఆలోచించి జాగ్రత్తగా చేయాలి. హెయిర్‌కటింగ్ ఎక్కడకు వెళతావు?"

"మా కాలనీలో చిన్న షాపు వుంది. చాలా బాగా చేస్తాడు. తలకు ఆయిల్ మసాజ్ కూడా చేస్తాడు."చిర్రెత్తుకువచ్చింది రావుకు.

"చెట్టుక్రింద బార్బర్ దగ్గరకు వెళ్లలేకపోయావు?" దాదాపుగా తిట్టినంతగా అన్నాడు. బిత్తరపోయాడు సుబ్బారావు.


"ఏసీ కూడా ఉంది సార్"

"ప్రతివాడికీ ఏసీ, సెల్‌ఫోన్, కారు... ఇవన్నీ సాధారణం ఈ రోజుల్లో. ఎక్కువయినా పెద్ద పేరుగల బ్యూటీ క్లినిక్స్‌కి వెళ్లాలి. వీలయితే స్పాకు వెళ్లు"

"అక్కడకు వెళితే నిజంగా క్షవరం చేస్తారు సార్"


"ఆ లెవెల్ నువ్వు మెంటైన్ చేయాలి. నీ క్లయింట్ నిన్ను అక్కడ చూడాలి. అదే నీకు సగం మార్కెటింగ్."

"అంత డబ్బులు పెట్టి..."



## హన్సిక అత్యాశ

దేశముదురు చిత్రం తరువాత హన్సికకు చెప్పుకోదగ్గ హిట్ లేకపోయినా తను తీసుకునే పారితోషికం విషయంలో ఏమాత్రం రాజీ పడడంలేదు. పూరీ జగన్నాథ్ తన చిత్రంలో నటించమంటే 80 లక్షల వరకు డిమాండ్ చేయడంతో గత్యంతరంలేక మరో హీరోయిన్‌ను తీసుకున్నాడట. ఆశ ఉండడం మంచిదేగానీ అత్యాశ మాత్రం పనికిరాదంటున్నారు సినీజనాలు.



"డబ్బులు పెట్టలేకపోతే నీవే ఇంట్లో చేసుకో. లేదా ఊరు బయటకు పోయి ఎవరికీ కనబడక చేయించుకునిరా. చిన్న షాపులో ఎవరూ నిన్ను గుర్తించనిచోట"

తల తిరిగిపోయింది సుబ్బారావుకు. ఆఖరుకు హెయిర్ కటింగ్‌కు కూడా ప్రాబ్లమేనా? రావు గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"నీకు మొబైల్‌లో ఎన్ని కాల్స్ వస్తాయి రోజుకు?"

"ప్రాజెక్ట్ నడుస్తున్నప్పుడు పదిదాకా వస్తాయి. పేమెంట్ సమయంలో ఒక్క కాల్ రాదు. చేసిన కాల్‌కు రెస్పాన్స్ కూడా ఉండదు."

"అలా అయితే నీవు పనిలేక చాలా ఖాళీగా ఉన్నావనుకుంటారు. నీవు చాలా బిజీ అన్న ఫీలింగ్ ఎదుటివాడికి కలగాలి. ఉల్టాగిల్టా వర్కింగ్ డ్రాయింగ్ ఇష్యూ చేయి. అవి అర్థంకాక సైట్ నుండి నీకు పదే పదే కాల్స్ వస్తాయి. బిజీ ఆర్కిటెక్ట్ అన్న ఫీలింగ్ రావాలి అందరికీ. అప్పుడే నీకు వాల్యూ. నీకు లైన్ కడతారు ప్రాజెక్ట్స్ ఇవ్వడం కోసం. ఏ కాల్స్ రాకపోతే నీ ఆఫీసు నుంచే డమ్మీ కాల్స్ వచ్చేలా చేయి"

బిత్తరపోయి చూస్తుండిపోయాడు సుబ్బారావు.

"సైట్ విజిట్స్‌కి అందరికీ ఒకటే టైమ్ ఇవ్వాలి. కాల్‌మీద కాల్స్ వస్తాయి అక్కడ లేబర్ వర్కర్స్ వెయిటింగ్‌వల్ల. నీకో నిజం తెల్సా? ఆర్కిటెక్ట్ టైం ఎంత వేస్టయినా క్లయింట్‌కు పట్టదు. ఓ తాపీ మేస్త్రో, కార్పెంటరో వెయిట్ చేస్తే క్లయింట్ టెన్షన్ పడిపోతాడు. ఫోన్లమీద నిన్ను టెన్షన్ పెట్టేస్తారు. మన ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఇదే."

బుద్ధిగా వింటున్నాడు సుబ్బారావు. రావు చెప్పినదాంట్లో చాలా నిజాలు ఉన్నాయి. ఆర్కిటెక్చర్ ఫస్టియర్‌లో ఈ నిజాలు ఏ లెక్చరర్ చెప్పి ఉండి ఉంటే అప్పుడే కోర్సు వదిలి అగ్రికల్చరల్ బియస్సీలో చేరి ఉండేవాడు.

"అంతేకాదు, జనానికి మాయ కొట్టాలి. నీ హెడ్డాఫీసు హైదరాబాద్, బ్రాంచీలు దుబాయి, సింగపూర్."అదిరిపోయాడు సుబ్బారావు.గుండె దడదడలాడింది. నోరెండిపోయింది.

"అసలు నాకు పాస్‌పోర్టే లేదు సార్"

"పాస్‌పోర్ట్ ఎందుకు? అయినా అలా ఖాళీగా కూర్చునే బదులు పాస్‌పోర్ట్ ఆఫీసుకు వెళ్లి అప్లై చేయవచ్చుగా. సరే ఎప్పుడూ క్లయింట్ ముందు 'సింగపూర్ ప్రాజెక్ట్ 15 రోజుల్లో కంప్లీట్ చేయాలి, లేకపోతే చాలా ప్రాబ్లం అవుతుంది. దుబాయ్‌లో కొత్త ప్రాజెక్ట్ అగ్రిమెంట్ చేయాలి' అని ఏదో ఒకటి వాగుతూనే వుండాలి. సడెన్‌గా నీవు ఓ వారం రోజులు దుబాయ్ వెళ్లిపోతావ్"సుబ్బారావుకు చెమట్లు పట్టాయి.

"ఎలా వెళతాను సార్. డబ్బులు, పాస్‌పోర్ట్, వీసా..."

"నిన్ను నిజంగా వెళ్లమన్నానా? ఏ యాదగిరిగుట్టో, అరకువేలీకో వెళ్లి వారంరోజులు ఉండిరా. నీ స్టాఫ్ నీవు దుబాయ్‌కి వెళ్లావని బిల్డప్ ఇస్తారు. అప్పుడే నీకు వాల్యూ. ఇంకో విషయం... అమెరికా ఇంటీరియర్ డిజైన్ అసోసియేషన్‌లో నీకు మెంబర్‌షిప్ ఉంది." బిత్తరపోయాడు సుబ్బారావు.

"నాకా?"

"అవును నీకే. అర్జంటుగా అమెరికా వెళ్లాలి నెలరోజుల్లో. లేకపోతే మెంబర్‌షిప్ కాన్సిల్ అవుతుంది."

కళ్లు తిరిగిపోతున్నాయి సుబ్బారావుకు.

"ఈ విధంగా బిల్డప్ ఇవ్వాలి. రేపు నిజంగా వెళ్లవు, నీకు మెంబర్‌షిప్ లేదు, ఎవడు చూడొచ్చాడు?"

"సార్...నేను ఏ దేశం చూడలేదు. తేడా వస్తుంది" అన్నాడు.

"సీడీలు దొరుకుతాయి చూడు. చూసినట్లు బిల్డప్ ఇవ్వడమే."

చాలా నీరసపడిపోయాడు సుబ్బారావు. 'అవును ఛేంజ్ కావాలి, లైఫ్‌లో మార్పు రావాలి.'

ఒక్కసారిగా ఉత్తేజం వచ్చింది. స్ప్రింగ్‌లాగా లేచాడు.

రావు కొద్దిగా కంగారుపడ్డాడు సుబ్బారావు వాలకం చూసి.

సుబ్బారావు చకచకా బాగ్ సర్దుకున్నాడు. సుబ్బారావు పరిస్థితి రావుకేం అర్థం కావడంలేదు.


"ఏం సుబ్బారావు ఏమయింది?" అడిగాడు రావు.

"అర్జంటుగా వెళ్లాలి. సింగపూర్ ఫ్లయిట్ క్యాచ్ చేయాలి. ఈ రోజు టిక్కెట్ సంగతి మరచిపోయాను దుబాయ్ ప్రాజెక్టు హడావుడిలో పడి. లేటయింది" దూసుకుపోయాడు బయటకు. రావుకు పిచ్చెక్కిపోయింది.

"సుబ్బారావు ఆఫీసుకు లాక్ చేయి" అరుస్తున్నా సుబ్బారావు వినిపించుకోలేదు.

"వార్నీ ఏమయింది వీడికి. దుబాయ్ పిచ్చి పట్టలేదుకదా? డోస్ కాస్త ఎక్కువయినట్టుంది పాపం..." రావు నిట్టూర్చాడు.

★



## ఏనుగులకు విముక్తి

సెంట్రల్ జ్యూ అథారిటీ ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం దేశంలోని 26 జంతు ప్రదర్శనశాలలో వున్న మొత్తం 140 ఏనుగులకి త్వరలో విముక్తి దొరకనుంది. ఈ జాతి అంతరించి పోకుండా ఉండాలంటే వాటిని నియమిత స్థావరాల్లో బందీలను చేయకూడదని నిపుణుల అభిప్రాయం మేరకు వాటిని విశాలమైన సహజ అరణ్యాలలో వదిలి వేస్తారుట. అలాగే ఇకపై సర్కసు వారు కూడా ఏనుగుల్ని నిర్బంధించి ఆడించరాదని ప్రభుత్వం ఆజ్ఞలు జారీ చేసింది.

-తటవర్తి

